విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 06 మార్చి 2025 8 పేజీలు

అన్నదాతల ఆగ్రహం

- మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసన
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్ర మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) దేశవ్యాప్త పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, రైతుల పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని,రైతాంగ వ్యతిరేక విధానాలు విడనాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (స్ఫూర్తి భవనం) జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, బి.కె.ఎంయు రాష్ట్ర ఉపాధ్య క్షులు బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం 2021లో ఢిల్లీ రైతు ఉద్యమ విరమణ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి రాతపూర్వకంగా ఇచ్చిన ▶మిగతా 2లో..

పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో సింగిల్ డెస్కు విధానం కింద పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జరిగింది. సింగిల్ డెస్కు విధానం క్రింద గడచిన త్రైమాస కాలంలో అందిన దరఖాస్తుల పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు, ఎంఎస్ఎంఈ సర్వే, పీఎం విశ్వకర్మ యోజన, క్లస్టర్ డెవలప్మెంట్ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్..పరిశ్రమలు, ఫ్యాక్టర్స్, పొల్యూషన్ ▶మిగతా 2లో..

గిరిజనుల అభివృద్ధికి సహకరించండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి
మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: గత 35 ఏళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలపై ఏపి గిరిజన సమాఖ్య పోరాటాలు చేస్తుందని, అధికారులు కూడా తమ వంతు బాధ్యతగా గిరి జనుల అభివృద్ధికి సహకరించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యాలయం నిర్మాణానికి బుట్టాయిగూడెంలో స్థలం కేటాయించా లని కోరుతూ గిరిజన సమాఖ్య జిల్లా సమితి కార్యదర్శి కారం దారయ్య ఆధ్వర్యంలో తహసిల్దార్ చలపతిరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఉన్న సమస్యలపై బుట్టాయిగూడెం కేంద్రంగా గిరిజన సమాఖ్య అనేక కార్యకలాపాలు నిర్వహిస్తుం దని, వారి సమస్యల పరిష్కారానికి బహిరంగ సమావేశాలు నిర్వహించడం కష్టమవుతుందని ఆయన తెలిపారు.గిరిజనులతో మమేకమై వారి సమస్యలు,హక్కుల కోసం పోరాటం చేయడానికి ప్రభుత్వ అధికారులు సహకరించి స్థలాన్ని కేటాయిం చాలని ఆయన కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ప్రత్యేక చట్టాలను పటిష్టంగా అమలు చేసి గిరిజనుల అభివృద్ధికి ▶మిగతా 2లో..

కోకో హబ్‌గా కోనసీమ జిల్లా

కలెక్టర్ మహేష్ కుమార్

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమ జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దేందుకై నాంది పలుకుతూ కోనసీమ కోకో సంఘం ఏర్పాటుకు యోచన చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఉద్యాన సహకార రిజిస్ట్రార్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కోనసీమ కోకో సంఘం ఏర్పాటు విధివిధానాలపై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘంలో అధ్యక్షులుగా జిల్లా జాయింట్ కలెక్టర్, ఉపాధ్యక్షులుగా జిల్లా ఉద్యాన అధికారి, సభ్యులుగా జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, మరొక సభ్యులుగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జిల్లా సహకార అధికారి జిల్లా రిజిస్టర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాల నుండి అడ్డాల గోపాలకృష్ణ సరేళ అప్పారావు నియమించడం జరుగుతుందన్నారు. సంఘ రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ వారీగా కోకో పంటల విస్తరణకు జిల్లాలో ప్రాథమిక దశలో వెయ్యి ఎకరాలను గుర్తిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. జిల్లాలో లక్ష ఎకరాలు విస్తీర్ణంలో కొబ్బరి తోటలు ఉన్నాయని వీటి 50% పాక్షిక నీడలో కోకో సాగుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 120 మంది గ్రామ ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమాలు ఉద్యాన శాఖ ద్వారా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్టర్ నాగలింగేశ్వరరావు, జిల్లా

ఒత్తిడిని జయించేందుకు క్రీడలు

మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్‌లో
కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులు తమ రోజువారి విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్(ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్) ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు మహిళా ఉద్యోగు లకు నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ షణ్మోహన్ హాజరై, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఏపీఎన్జీవో అసోసియేషన్ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్‌రావు ఆవిష్కరించారు. అనంతరం క్రీడలు ప్రారంభిస్తూ కలెక్టర్ ప్రకటన చేసి, బెలూన్స్ ఎగరవేశారు. అనంతరం 100 మీటర్ల పరుగు పందాన్ని కలెక్టర్.. ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి జండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈ నెల 5, 6 తేదీల్లో రెండు రోజులు మహిళా ఉద్యోగులు తమ రోజువారి విధులను పక్కనపెట్టి వయసుతో సంబంధం లేకుండా అందరూ ఆటల పోటీలలో పూర్తిగా నిమగ్నం కావాలన్నారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనాలని కలెక్టర్ తెలిపారు. నిత్యం కార్యాలయాల్లోని విధులు, కుటుంబ బాధ్యతలతో మహిళలు ఒత్తిడికి గురవుతూ ఉంటారన్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ఇటువంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడ తాయని ఆయన తెలిపారు. శారీరకంగా బలంగా ఉన్నప్పుడే సరైన నిర్ణయాలు ▶మిగతా 2లో..

జిల్లా కేంద్రాల్లో వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8 న ప్రకాశం జిల్లా మార్కాపురంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి చాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో ముందస్తు ఏర్పాట్లపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమంతో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా "లక్ పతి దీదీస్ అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు వంద మంది మహిళా ఎంట్రప్రెన్యూర్లను ముఖ్యమంత్రి సత్కరించనున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వంద చేనేత మహిళా కళాకారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.10 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించబోతున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ కె. వెట్రిసెల్వి హాజరయ్యారు.

లైన్‌మెన్లకు సత్కారం

విశాలాంధ్ర -భీమవరం: ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో ఉత్తమ సేవలు అందిస్తున్న 13 మంది విద్యుత్ లైనమెన్ లకు అత్యుత్తమ సేవాపురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్

అలపాటి రఘునాథబాబు పూల మాలలు దుశ్శాలువాతో లైన్ మెన్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. ఝాన్సీ, ఎం.వెంకటేశ్వరరావు, కె.నర్సింహామూర్తి, కె.మధుకుమార్, బి.రఘు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావద్దు

విశాలాంధ్ర-లింగపాలెం: మత్తుకు బానిసలు కావద్దని నరసింహారావు, అబ్దుల్ ఖలీల్ తెలిపారు. యడవల్లిలో జరిగిన నవోదయ కార్యక్రమంలో మత్తు పదార్థాలు నివారణ పై ప్రజలకు అవగాహన

కల్పించారు. నాటుసారా తయారీ అమ్మకాలు పూర్తిగా నిషేధించాలని, ఎటువంటి మత్తుకు ప్రజలుబానిసలు కావద్దని అన్నారు. మత్తుకు బానిసలు అవ్వటం వల్ల అనారోగ్య బారిన పడటమే కాకుండా కుటుంబాలు చితికి పోతాయని తెలిపారు. గ్రామంలో పర్యటించిన వీరు నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పి. చెన్నారావు పై కేసు నమోదు చేశారు. ఇతని వద్ద నుంచి కొన్ని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థినిలకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టణ పోలీస్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు

వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో మహిళ స్థానం, మహిళా శక్తి కరణ, మహిళా భద్రత మన బాధ్యత వంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సత్య శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

విశాలాంధ్ర - కుక్కునూరు: సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల డిమాండ్ చేశారు.

మండలంలోని కివ్వాక గ్రామంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఆమె మాట్లాడారు. రోజురోజుకు మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చిన్నారులను కూడా చిదిమేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని కోరారు. నేటి సమాజంలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని శ్యామల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ, స్వరూప,అన్నపూర్ణ,సుజాత, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు (1వ పేజీ తరువాయి)

కంట్రోల్ బోర్డ్, గ్రౌండ్ వాటర్, సాంఘిక సంక్షేమం, అగ్నిమాపక, ఏపీఐఐసీ తదితర శాఖల అధికారులు సమీక్షించి ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం సీహెచ్ గణపతి, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి రాధాకృష్ణ, రవాణా శాఖ అధికారి జివి శివ ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎ. రమణా రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ఇన్చార్జ్ డీడీ జి శ్రీనివాస రావు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, జిల్లా అగ్నిమాపక ఇతర శాఖల జిల్లా అధికారులు, పరిశ్రమల శాఖ సిబ్బంది సురేశ్, విజయ్ కుమార్, సందీప్, వివిధ అసోసియేషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సహకరించండి (1వ పేజీ తరువాయి)

సహకరించాలన్నారు. విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గిరిజనుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే సరైన రోడ్డు మార్గం లేక ఏజెన్సీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యతతో కూడిన రోడ్లను నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురై,అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నా రని విమర్శించారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు పేద ప్రజలకు మేలు చేకూర్చే విధంగా లేవని ఆయన వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, మెరైన రవాణా సౌకర్యాలు లేక గిరిజన ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని ప్రభుత్వం తక్షణం రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే ఎర్రజెండా పార్టీలకు అధికారులు ప్రజలు సహకరించి వాటి మనుగడకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బుట్టాయి గూడెం సీపీఐ కార్యాలయ కన్వీనర్ చోడెం దుర్గ,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.శివకుమార్, కోశాధికారి ఎం.క్రాంతి, కురసం సూర్యచంద్ర రావు, మడకం దుర్గారావు, తెల్లం మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు (1వ పేజీ తరువాయి)

తీసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి కుటుంబంలోని ఒక వర్కింగ్ ఉమెన్ ఉంటే ఆ కుటుంబం ఆర్థికంగానే కాకుండా ఇతర విషయాల్లోనూ సంతోషంగా ఉంటుందన్నారు. ఇతర జిల్లాల్లో లేని మంచి సంస్కృతి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ ప్రతినిధులు అమలు చేయడం అభినందనీయ మన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమైనదన్నారు. మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే తమ కుటుంబాలను, ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలరని తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు జి.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ 2019 నుంచి మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం ప్రారంభించామన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో 12 రకాల వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసు, జిల్లా కార్యదర్శి పి.వెంకటకృష్ణ, ఏపీఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఎ. రామానాయుడు, బి. ఆశీర్వాదం, మహిళా విభాగం చైర్ పర్సన్ బి. సుజాత, జిల్లా కోశాధికారి వై. పద్మ మీనాక్షి, మహిళా విభాగం కన్వీనర్ ఎ. దేవి, వివిధ శాఖల ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆగ్రహం (1వ పేజీ తరువాయి)

హామీలు అమలు చేయలేదన్నారు. మద్దతు ధరలు, రైతులకు ఆర్థిక తోడ్పాటు వంటి అంశాలలో కేంద్ర ప్రభుత్వమే నియమించిన పార్లమెంటరీ కమిటీ చేసిన సూచనలు అమలు కాలేదన్నారు. విద్యుత్ సవరణ చట్టాన్ని యథాతథంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించటానికి మరొక మూడు పథకాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల అజమాయిషీలో ఉన్న ప్రాథమిక సహకార సంఘాలను, పాడి రైతుల సహకార సంఘాలను, మత్స్యకార సహకార సంఘాలను పెట్టుబడి దారులకు అప్పగించేందుకు చట్టం చేసిందన్నారు. డిజిటల్ అగ్రి మిషన్ పేరుతో 11 కోట్ల మంది రైతులను కార్పొరేట్ కంపెనీల గొడుగు కిందికి చేర్చడానికి పథకం రూపొందించిందన్నారు. జిల్లాలోని మిర్చి,పత్తి, కోకో, మినుములు, పెసలు వంటి పంటలకు ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి మామిడి ధర పడిపోయిందని, మిర్చికి ప్రకటించిన ధరల వ్యత్యాస పథకం రైతులకు ఏమాత్రం ప్రయోజనం కాదన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు ఇంకా ప్రారంభించ లేదని, సాగునీటి ప్రాజెక్టులు,పంట కాలువలు, డ్రైన్ల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీసీసీని బలోపేతం చేసి గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, చింతపండు, జీడిమామిడి తదితర గిరిజన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి రైతు సంఘాల సమన్వయ సమితి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఘంటా పాపారావు, పి.సుభాష్ చంద్రబోస్, గండి రాజా, రైతు కూలీ సంఘం (ఆంధ్ర) నాయకులు పి. పరమేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామ చంద్రమూర్తి,ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు కొమరం రామారావు, సాంద్రు గంగాదేవి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కూచిపూడి నాగేశ్వరరావు, బి కె ఎం యు జిల్లా ఉపాధ్యక్షులు గోలిమే బాలయేసు, పొట్టేలు పెంటయ్య, నాయ కుల గుదే ఆశీర్వాదం, ఏఐటీయుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతు సంఘం నాయకులు బొల్లు రామ కృష్ణ, గుడిబండి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, GADEY KANAKADURGA VARDHANI ANNAPURNA (New Name), W/o GADEY VENKATA RAMANJANEYA PRASAD Previously Called GADE KANAKA DURGA VARDHINI ANNAPURNA (Old Name), Resident of D.No.21-6-2, Veliveti Vari Street, Sajjapuram, Tanuku, Tanuku Mandal, W.G.Dist-534211, Andhra Pradesh. I have changed my name from GADE KANAKA DURGA VARDHINI ANNAPURNA (Old Name) To GADEY KANAKADURGA VARDHANI ANNAPURNA (New Name) for all practical purposes.

తెలుగు, హిందీ పరీక్షకు 974 మంది హాజరు

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం హిందీ, పరీక్ష రాసే విద్యార్థులు 1092 మంది విద్యార్థులు ఉండగా, 974 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని 118 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి, ఇ.వి.వి.ఎన్.ఎస్.ఎస్. ఎస్.బి.ఎల్. నారాయణ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, జిల్లాస్థాయి పరిశీలకులు, జిల్లా కోఆర్డినేటర్లు పరీక్ష కేంద్రాలను తనిఖీ నిర్వహించి ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగలేదని విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

క్రీస్తు మార్గంలో జీవించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: క్రైస్తవులు పవిత్రంగా భావించే విభూది బుధవారం చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు సిలువలో మరణించే ముందు 40 రోజులపాటు ఏకాంత ప్రార్థనలు చేస్తారు. బైబిల్ గ్రంథం ప్రకారం విభూది బుధవారం నాడు ఇది మొదలవుతుంది. క్రైస్తవులు

ఈనలభై రోజులను పవిత్రంగా భావిస్తారు. వీటిని శ్రమల దినాలుగా ఆరాధిస్తారు. వీటిని అనుసరించే విశ్వాసులు ఈ 40 రోజులపాటు ఎటువంటి శుభకార్యాలు జరుపుకోరు. ప్రతిరోజు ప్రార్థనలతో గడుపుతారు. ఈ సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనేకమంది విశ్వాసులు దీక్ష మాలలు ధరించారు. వీరంతా ఉపవాస ప్రార్థనలతో పాటు నిష్ఠగా జీవనం సాగిస్తారు. క్రీస్తు చేసిన త్యాగాలు మానవాళికి ఆదర్శప్రాయం కావాలని మత బోధకులు చర్చిలలో బోధనలు చేశారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గమైన క్షమ, దయ,జాలి,కరుణతో ఉండాలని తెలిపారు.

సమిష్టి కృషితో పేరాబత్తుల విజయం

విశాలాంధ్ర -భీమవరం: ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించిన పట్టభద్రుల ఓటర్లకు భీమవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకులకు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు భీమవరం నియోజకవర్గ ఇన్చార్జ్ తోట సీతారామలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో

నిర్వహించిన ఎమ్మెల్సీ విజయోత్సవ వేడుకల్లో తెలుగు తమ్ముళ్లు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుని, పట్టణంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని బిజెపి టిడిపి టిడిపి జనసేన పార్టీల నాయకులతో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సమన్వయంతో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించి ఎన్నికల ప్రచారంలోనూ ఎన్నికల రోజున సమర్థవంతంగా పనిచేసి సమిష్టికృషితో విజయం సాధించగలగా మన్నారు. కార్యక్రమంలో వీరవాసరం ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, ఎన్డీఏ కూటమి నాయకులు మెరగాని నారాయణమ్మ, కోళ్ల నాగేశ్వర రావు, వేండ్ర శ్రీనివాస్, ఇందుకూరి రామలింగరాజు, పొత్తూరి బాపిరాజు, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

9న ఆకివీడులో వందే ముకుంద ఆర్‌సి మీట్

విశాలాంధ్ర -ఉండి : ఈ నెల 9 వ తేదీ ఆదివారం ఆకివీడులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వందే ముకుంద ఆర్. సి. కార్యక్రమం జరుగుతుందని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ గొంట్ల కృష్ణ మూర్తి అన్నారు. బుధవారం ఆయన ఉండి లయన్స్ క్లబ్ సభ్యులను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలనాగారాణి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్టు ఆయన

తెలిపారు. ఆరోజు సేవకార్యక్రమాలు, లయన్స్ క్లబ్ మహిళా బాధ్యులకు సత్కారాలు, రీజియన్‌లో ఉత్తమ సేవలు అందించిన క్లబ్ లకు అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు, బొండాడ కేశవ, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాకు అవమానం

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : మన దేశానికి గర్వకారణంగా చెప్పుకునే జాతీయ జెండాకు ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఘోర అవమానం జరిగింది. అక్కడి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ

మువ్వన్నెల జాతీయ జెండాను ఆరుబయట మెట్లపై వదిలేసి త్రివర్ణ జెండా ఖ్యాతిని అభాసుపాలు చేశారు.కోట్లాదిమంది భారతీయులు పవిత్రంగా భావించే జాతీయ జెండాను ఉన్నతంగా భద్రపరచాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు మెట్లపై మసిగుడ్డలా పాడేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ చరిత్రలో విశిష్ట స్థానం కలిగిన జాతీయ జెండాను నిర్లక్ష్యంగా పడవేయడంలో అక్కడి అధికారుల అలసత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ జెండా చిరిగిపోతే, ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా, 2022లో పేర్కొన్న నిబంధనల ప్రకారం జెండా గౌరవాన్ని కాపాడేలా భూమిలో పాతి పెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించి మౌనం పాటించాలి. ఇలా దుమ్ము పట్టి మాసిపోయే విధముగా బయట పాడేయడంతో ప్రజల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జెండాను బయట పాడేసిన సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకొని మూడు రంగుల జెండా గౌరవాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యదుర్గను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మెట్ట ప్రాంతంలోని ఏజెన్సీ ముఖద్వారమైన కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన గుదె దివ్య దుర్గ మహిళ ఎస్సై ఉద్యోగం సాధించడం మండలానికి గర్వకారణం అని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు బలుసు నాగేశ్వరరావు పేర్కొన్నారు. దివ్య దుర్గ ఇటీవల సబ్ ఇన్స్పెక్టర్‌గా శిక్షణను ముగించుకుని స్వగ్రామమైన కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామం రావడంతో బలుసు

నాగేశ్వరరావు ఆమె ఇంటి వద్ద ఆమెను ఘనంగా సత్కరించారు. తన తండ్రి మిషన్ టైలర్ గా వృత్తి కొనసాగిస్తూ ఉంటారని మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఈమె , సచివాలయ మహిళా పోలీస్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుని, మంచి మార్కులు సాధించి, ఎస్సై ఉద్యోగం సాధించిందని, మెట్ట ప్రాంతంలో ఉన్న మహిళలు దివ్య దుర్గను ఆదర్శంగా తీసుకొని , వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో తమ సత్తా చూపాలని నాగేశ్వరరావు అన్నారు. మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి , ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆమెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజులపాటి ప్రవీణ్ కుమార్, ఎస్ కే జాంగిర్ భాష పాల్గొన్నారు.

కొనకళ్ళ రామారావు మృతికి పలువురి సంతాపం

విశాలాంధ్ర-టి.నరసాపురం: సిపిఐ మాజీ నాయకులు కొనకళ్ళ రామారావు హైదరాబాద్ లో ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మక్కినవారిగూడెం గ్రామంలోని ఆయన నివాసం వద్ద బుధవారం పలువురు ఆయన పార్థీవ దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో సిపిఐ క్రియాశీల కార్యకర్తగా సేవలందించిన ఆయన మక్కినవారిగూడెం గ్రామపంచాయతీ ఉప సర్పంచ్‌గా,



సహకార సంఘ పాలకవర్గ సభ్యునిగా సేవలందించారు. ఆయన సేవలను పలువురు కొనియా డారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టివిఎస్ రాజు, బి ఎన్ సాగర్, షేక్ జాకీర్ హుస్సేన్ , సబ్బి కనకారావు, ఎల్ ఆర్ కృష్ణ బాబు, వీరమల్ల సత్యనారాయణ, కంచర్ల గుర్వయ్య, టి. బాబు, దొంతా కృష్ణ, రామచంద్రారెడ్డి, సోమశేఖర్, రమేష్ రెడ్డి,పురం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర -ఏలూరు: దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష కాంట్రాక్టు ,ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు సామూహిక నిరసన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షులు కే వినోద్ కుమార్ ,జిల్లా మహిళా కార్యదర్శి కె. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ డిమాండ్ల సాధనలో భాగంగా 2023 డిసెంబర్23- 2024 జనవరి 10 వరకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె నిర్వహించారని అన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలు, మినిమం టైం స్కేల్ అమలు ,వేతనాలు పెంపు, ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ, పదవీ విరమణ 62 సంవత్సరాలకు పెంపు, కారుణ్య నియామకాలు, జాబ్ చార్ట్అమలు ,గ్రాట్యూటీ చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరిస్తామని అప్పట్లో ప్రభుత్వం హామీ ఇచ్చిందని వారు అన్నారు. వాటిలో ఒక్క డిమాండ్ కూడా అమలుకు నోచుకోని కారణంగా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్

ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. సమస్యల సాధనలో భాగంగా ఈనెల 5 ,6 తేదీలలో సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయం, మండల కేంద్రాలు, కేజీబీవీ స్కూళ్ల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో మహిళ ఉద్యోగుల సమస్యలపై సదస్సు నిర్వ హిస్తున్నామన్నారు. ఈనెల 11న విజయ వాడలో నిరసన దీక్షలు ప్రారంభించ నున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమగ్ర శిక్ష అవుట్సోర్సింగ్ ,కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. నిరసన దీక్షలో సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారత సాధించాలి

విశాలాంధ్ర-భీమవరం : మహిళలు ప్రతి రంగంలో సాధికారత సాధించిన రోజున దేశం ప్రగతి పథంలో నడుస్తుందని పలువురు వక్తలు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిబా మహిళ కేంద్రంలో సదస్సు, బాలికలకు పోటీలు, మహిళలకు కుట్టు అల్లికలు పోటీలు నిర్వహించి విశిష్ట మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా మహిళ కేంద్రం నిర్వాహకురాలు రత్నమాల మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ దశలోనూ సమాజంలో మూల స్థంభంలా మహిళ నిలుస్తుందని, ఆధునిక కాలంలో మహిళ అబల కాకుండా సబలగా మారిందన్నారు. డిఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయ అధికారిణి ఇందుకూరి శిరీష మాట్లాడుతూ సమాజ

నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్ని రంగాల్లో మహిళలు సాధికారత సాదించాలన్నారు. అనంతరం దివ్య సందేశ సంస్థ అధ్యక్షులు ఎండి సరోజినీ, అరుణోదయ మనో వికాస కేంద్రం ఉపాధ్యాయులు పేన్మెత్స దేవి, నేదునూరి రాధ, కే.శ్రీలక్ష్మి, విఎం కుమారి లను ఉత్తమ మహిళలుగా సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో శ్రీ చైతన్య విద్యార్థుల హవా

విశాలాంధ్ర - ఏలూరు : శ్రీ జవహర్ లాల్ నెహ్రూ మెమోరియల్, ఆల్ ఇండియా కరాటే డు ఛాంపియన్ షిప్ కరాటే ఆధ్వర్యంలో చిలకలూరిపేట, పల్నాడు జిల్లా వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో దేశం నలుమూలల నుండి సుమారు 600 మంది పాల్గొనగా శాంతినగర్ శ్రీ చైతన్య విద్యార్థులు పలువురు తమ సత్తా చాటి

ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివ కుమారి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభలో ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థులు విద్యతో పాటు సర్వతోముఖాభి వృద్ధి సాధించడంలో ముందంజలో ఉన్నారని, ఆత్మ రక్షణతో పాటు ఆరోగ్య పరిరక్షణలో కరాటే ఎంతో ఉపయోగపడు తుందన్నారు.

విజేతల వివరాలు:

ఆర్. భగత్ కట్టా-ప్రథమం, కుమ్తే-ప్రథమం, సి. హెచ్. ఈశాన్ కట్టా -ప్రథమం కుమ్తె ప్రథమం, డి. ఋషిత కట్టా ప్రథమం కుమ్తే - ద్వితీయం, సాయి సిద్ధార్థ కట్టా - ప్రథమం భరత్ కట్టా - ప్రథమం, కుమ్తె ద్వితీయం, ఎ. మోహన్. కట్టా -ద్వితీయం కుమ్తె -ద్వితీయం, టి .సిద్ధార్థ కట్టా- ద్వితీయం కుమ్తె ద్వితీ యం, ఎం.డి. జియాయు ద్దీన్ కట్టా- ప్రథమం కుమ్తె- తృతీయం , ఎం. డి.మిన్హాజ్ కట్టా-తృతీ యం సభలో శ్రీ చైతన్య విద్యాసంస్థల జోనల్ ఎకడమిక్ డీన్. జె.సంజీవ్ కుమార్. ప్రైమరీ కరాటే ట్రైనర్ శ్రీనివాస్, చిన్నారుల తల్లిదండ్రులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా జరిపించాలి

డ్వామా పీడీ ఆదేశం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి పనుల సర్వే నివేదికను జిల్లా డ్వామా కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో సమర్పించారు. ప్రజా వేదిక డ్వామా పి.డి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఏడాది కాలంలో 1633 పనులను చేశారు.

వీటికి సంబంధించి దాదాపు రూ21.48 కోట్లు ఖర్చు చేశారు. రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ నందిని ఆధ్వర్యంలో ఐదుగురు డిఆర్పీలు, ఎనిమిది మంది సిబ్బంది కలిసి గ్రామాల వారీగా చేసిన పనులను తనిఖీ చేశారు.16 రోజులపాటు జరిగిన ఈ తనిఖీలకు సంబంధించి ప్రజా వేదిక నిర్వహించారు. సర్వేలో వెల్లడించిన వివరాలు ప్రకారం రూ.16 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. వీటిని అధికారులకు సమర్పించారు. రూ.3 లక్షల విలువ గల మొక్కలు మొలకెత్తలేదని వీటిని తిరిగి పెంచే బాధ్యతను ఆయా పరిధిలోని క్షేత్రస్థాయి సహాయకులకు అప్పగించారు. పనులు తక్కువ చేసి వేతనాలు ఎక్కువ ఇవ్వటం వల్ల రూ.10 లక్షలు వ్యత్యాసం వచ్చినట్లు గుర్తించారు. మస్తర్లు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్ల రూ.3లక్షల తేడా కనిపించిందని తెలిపారు. ప్రజా వేదికలో డ్వామా పీడీ మాట్లాడుతూ చేసిన పనికి తగినంత మాత్రమే వేతనాలు చెల్లించాలని, రోజువారి కూలీ రూ.300 పడేలా కూలీలతో పనులు చేయించాలని తెలిపారు.ప్రతి ఉపాధి కూలి 100 రోజులు పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా వేదికలో డ్వామ విజిలెన్స్ అధికారి పురుషోత్తం,ఏపీడి దామోదర్, లింగపాలెం ఎంపీడీవో వాణి ఏపీవో వరలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

చర్చిలకు వ్యతిరేకంగా జారీ చేసిన సర్క్యులర్ ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : క్రైస్తవ చర్చిలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ వెంటనే ఉపసంహరించు కోవాలని పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం డిమాండ్ చేసింది. ఫోరం ఆవిర్భావ సభ బుధవారం కొయ్యలగూడెం లోని కృపాసన్నిధిలో జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా

ప్రముఖ విద్యా వేత్త అలుగు ఆనంద్ శేఖర్ హాజరై క్రైస్తవ హక్కుల గురించి వివరించారు. ఫోరం గౌరవా ధ్యక్షులు , హోమ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గెడ్డం శామ్యూల్ జాషువా మాట్లాడుతూ క్రైస్తవ్యానికి వ్యతిరేకత రూపుమాపాలంటే ప్రార్ధనా శక్తి కావాలన్నారు. పాస్టర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఉద్దేశ్యాలను ఫోరం అధ్యక్షులు బొగ్గవరపు బాబూరావు, కోటిపల్లి బెంజ్ మెన్ వివరించారు. అనంతరం దేశంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై చర్చించారు. పాస్టర్లకు కూటమి ప్రభుత్వం సహాయం చేయకపోగా చర్చి లు ధ్వంసం చేయటానికి రహస్య ఎజెండా అమలు చేస్తుందని విమర్శించారు. వెంటనే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సర్క్యులర్ ఉపసంహరించాలని తీర్మానం ఆమోదించారు. సర్క్యులర్ రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పాస్టర్లు ఆందోళనకు దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షులు పాలన్న, కోశాధికారి రత్న వర ప్రసాద్, సలహా దార్లు స్నేహన్, జాన్ విక్టర్ పాల్, యెహేజ్కేలు, జీవన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం.12 (1744533)/2019/డి.బి తేది : 05-03-2025

భీమవరం పురపాలక సంఘ పట్టణ పరిధి పురపాలక సంఘములో **షార్టు టెండరు నోటీసు** నెం.25(1-5)/BHI//General/2024-25/E2లోని **జనరల్ ఫండ్స్ నుండి 5 పనులకు** సంబంధించి **రూ. 16.26** లక్షలతో ఇ-ప్రొక్యూరుమెంటు ద్వారా **టెండర్లు** జి.వో.ఎం.ఎస్ నెం: 94 లేక దానిపై ఇతర అనుబంధ జి.వోల ప్రకారం రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి కోరబడుతున్నవి. మిగిలిన వివరములు ఇప్రొక్యూరుమెంటు మార్కెట్టు **www.tender.apeprocurement.gov.in** లేదా కమీషనరు, భీమవరం పురపాలక సంఘం, ప.గో. జిల్లా (సెల్ **9849906540, 9849906543**) వారిని సంప్రదించగలరు.

కమిషనరు,
భీమవరం పురపాలక సంఘం

దారుల్లో చెత్త... ఇదేనా స్వచ్ఛత

విశాలాంధ్ర - పెనుమంట్ర: గ్రామాల్లో పంచాయతీ సరైన ప్రణాళికలో వ్యర్థాలు సేకరణ చేయకపోవడంతో మండలంలోని ప్రధాన రహదారులు చెత్తమయంగా మారుతున్నాయి. గ్రామాలకు ఎవరైనా ఉన్నత ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తున్నప్పుడు తప్ప వీటిని పట్టించుకోవడం లేదు. నెగ్గిపూడి చివర వనంపల్లి గ్రామంలో పారిశుద్యం పూర్తిగా లోపించింది. వివిధ ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోయాయి. కొత్తగా ఏర్పడిన జగనన్న కాలనీ లో సుమారు 100 కుటుంబాలకు పైగా మూడు సంవత్సరాలు గా నివాసం ఉంటున్నారు. ఈ కాలనికి చెత్త రిక్షాలు గాని చెత్త సేకరించేవారు గాని ఎన్నడూ రాలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరించే వారు వస్తే ఇకపై చెరువు గట్టున వేసి నిప్పు పెట్టమని వారు అంటున్నారు. ఇదే కాలనీలో గ్రామ సర్పంచ్ నివాసం ఉండడం, మా ప్రాంతంలోనే చెత్త సేకరణ జరగకపోవడం విస్మయం కలిగిస్తుందని అంటున్నారు. నెగ్గిపూడి గ్రామంలోని ఇతర ప్రాంతాల్లో సైతం డ్రైన్ల నిర్వహణ, చెత్త తొలగింపు ప్రక్రియ సక్రమంగా సాగట్లేదని విమర్శలు ఉన్నాయి. స్థానిక లాకులు సమీపంలో నరసాపురం కాలువకు చేర్చి పెద్ద పరిమాణంలో చెత్త పడేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానికంగా పారిశుధ్య పరిస్థితిలను మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

బాల బాలికలు సోదర భావంతో మెలగాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: సమాజంలో బాల బాలికలు సోదర భావంతో మెలగాలని ఎస్ఐ ఎం.జయ బాబు తెలిపారు. బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లింగ సమానత్వం పై విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి తండ్రులకు బాలికల పట్ల చిన్న చూపు తగదు అన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బాల బాలికలను సమానంగా చూడాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ అలీ, పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

విశాలాంధ్ర - కుక్కునూరు: మండలంలోని పెదరాయిగూడెం గ్రామానికి చెందిన బాణోత్ సురేష్ ఇల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. సీపీఐ కుక్కునూరు మండల సమితి ఆధ్వర్యంలో

బుధవారం బాధితులకు ఆర్థిక సహాయం చేశారు. దుస్తులతో పాటు రూ.2 వేలు నగదును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ. బాధితులను స్థానిక అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. ఇప్పటికైనా బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కురాకుల బాబూరావు, మండల కార్యవర్గ సభ్యులు మడిపల్లి వెంకటరమణ, పెదరాయిగూడెం శాఖా కార్యదర్శి పల్లల భిక్షం, మహిళా సమాఖ్య నాయకులు గాడిద వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

వలసలు నివారించండి

విశాలాంధ్ర -ఏలూరు: ఉపాధి లేని గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలను నివారించాలని బి కే యం యు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బి కే యం యు) నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. బి.కే.యం.యు రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏలూరులో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బి కే యం యు ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ

గ్రామీణ పేదలు వలసల నివారణకై ఉపాధి హామీ పనులు కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించి,రోజు కూలి రూ.700 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ డిఆర్ఓకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి. కె.ఎం.యు. జిల్లాలో ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయి పడ్డ కూలి డబ్బులు తక్షణమే చెల్లించాలని కోరారు.గత నెల 17వ తేదీన కొయ్యలగూడెం మండలం కుంతల గూడెంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై ట్రాక్టర్ దూసుకెల్లడం వల్ల ఒక కూలి అల్లే భాగ్యవతి మరణించిందని, మరో ముగ్గురు గాయపడ్డారని వెంకటేశ్వర రావు డిఆర్ఓకి తెలిపారు.మరణించిన కూలి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.తీవ్రంగా గాయపడ్డ కూలికి రూ.5 లక్షలు,స్వల్పంగా గాయపడ్డ ఇద్దరు కూలీలకు ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాల యేసు,జిల్లా నాయకులు పొట్టేలు పెంటయ్య,గుడే ఆశీర్వాదం,కే. నాగేశ్వర రావు, ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం తీర్పు కోసం జడ్జినే మార్చేస్తారా?

చీపురుగూడెం అటవీ భూమిలో కోళ్లఫారం పరిస్థితి ఏమిటి

విశాలాంధ్ర - చాట్రాయి : ఓ వ్యక్తి చీపురుగూడెంలో సుమారు 13 ఎకరాల అటవీ భూమి ఆక్రమించుకుని కార్పొరేట్ కోళ్ల ఫారం నిర్మించుకుని సుమారు మూడు కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు తీసుకోవడంపై గత కొన్ని సంవత్సరాల క్రితం లోకాయుక్త కోర్టుకు ఫిర్యాదు చేయడంపై మూడుశాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు చేస్తున్న జాయింట్ సర్వేకు వెళ్లిన నేపథ్యంలో కోళ్ల ఫారానికి చెందిన యజమాని ఉన్నతాధికారులను బెదిరించే ధోరణితో మాట్లాడుతూ త్వరలోనే లోకాయుక్త జడ్జిని చంద్రబాబు నాయుడు మార్చేస్తున్నారని కొత్తగా వచ్చే టిడిపి జడ్జి తనకు అనుకూలంగా తీర్పు ఇస్తారని తనను గాని తన కోళ్లఫారాన్ని గాని ఎవరు ఏమీ చేయలేరని బెదిరింపు ధోరణితో మాట్లాడుతున్నట్లు పలువురు చర్చించుకుంటు న్నారు. చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామంలోని అటవీ ప్రాంతంలో చీపురుగూడెం నుంచి పోతనపల్లి పంచాయతీ మంకొల్లు వెళుతున్న ప్రధాన

రహదారిలో సుమారు 13 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించుకుని పది ఎకరాలలో కార్పొరేట్ కోళ్ల ఫారం కట్టుకొని మూడు ఎకరాలలో పామాయిల్ తోటలు పెంచుకోవడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు లోకాయుక్త కోర్టులో ఫిర్యాదు చేశారు. అప్పటినుండి జిల్లా కలెక్టర్ కూడా కోర్టు వాయిదాలకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూమి పూర్వపరాలను పరిశీలిస్తే 645/8లో పట్టా భూమిగా నమోదు చేసి పది ఎకరాలకు పాస్ బుక్ తీసుకుని కోళ్ల ఫారం నిర్మాణానికి సుమారు మూడు కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. చీపురుగూడెం గ్రామ రెవెన్యూ రికార్డు మొత్తం లో విలేజ్ మ్యాప్ లో గాని ఎఫ్ఎంబిలో గాని అర్ఎస్ఆర్ లో కానీ ఎక్కడ చూసినా 645/8 నెంబర్ లేని పరిస్థితి ఎన్నిసార్లు ఉన్నతాధికారులు పరిశీలన చేసినా ప్రభుత్వ రికార్డుల్లో ఆ నెంబర్ లేదు . రెవిన్యూ అధికారులు ఆ భూమి రెవెన్యూ శాఖకు సంబంధించినది కాదని నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. అటవీ శాఖ అధికారులు కూడా 645/2బిలో అటవీ భూమిగా గుర్తించినట్లు తెలుస్తోంది.645/7 సబ్ డివిజన్ తో రికార్డులు పూర్తిగా 645/8ని పట్టాభూమిగా 2013 వ సంవత్సరంలో సృష్టించి అప్పటినుంచి పదేళ్లపాటు ఖాళీగా ఉంచి 2023లో ఆధునిక కోళ్లఫారాన్ని నిర్మించారు. గ్రామంలో వచ్చిన విభేదాల నేపథ్యంలో పంచాయతీ తీర్మానాలు లేకుండా ఏ విధమైన అనుమతులు లేకుండా నిర్మాణం జరిగిందని లోకా యుక్త కోర్టులో ఫిర్యాదు చేయడంతో అధికారులు భూమి యొక్క పూర్వపరాలను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత ఫారెస్ట్ భూమిగా నిర్ధారణ చేసినట్లు తెలుస్తోంది. అటవీ భూముల్లో కట్టుకున్న కోళ్ల ఫారం కోసం లోకాయుక్త జడ్జిని మార్చేస్తారు తీర్పుతమకు అనుకూలంగా వస్తుందని ప్రచారం చేసుకోవడంపై పలువురు అవాక్కవుతున్నారు.

11న చలో విజయవాడ

విశాలాంధ్ర-చింతలపూడి: రాష్ట్ర అసెంబ్లీ సమావేశంలో మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పట్ల చర్చించని అసెంబ్లీ సమావేశా లను ఎండగడుతూ ఈనెల 11న చలో విజయవాడ లో ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం చింతలపూడి నగర పంచాయతీ యూనియన్ సమావేశం వెలగాడ అనురాధ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్ సమస్యలపై ఈ అసెంబ్లీ సమావేశంలో చర్చకే రానీయకుండా ప్రభుత్వం అడ్డుపడుతుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 38వేలమంది ఔట్సోర్సింగ్ విభాగంలో, కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో పనిచేస్తు న్నారని తెలిపారు.పర్మినెంట్ ఉద్యోగస్తులు సంబంధించి పెండింగ్ లో ఉన్న నాలుగు సంవత్సరాల సరెండర్ లీవ్ ల విడుదలపై, పెండింగ్ లో ఉన్న డీఏల విడుదలపై,బడ్జెట్లో ప్రస్తావనే లేదన్నారు. గత నెల 6న రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ఆప్కాస్ రద్దు చేసి, రెండు బడా కంపెనీలకు నిర్వహణకు

అప్పగించినట్లు ప్రకటించడం దుర్మార్గమన్నారు. దశాబ్దాలుగా ఔట్సోర్సింగ్ మున్సిపల్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేయాలని,గతంలో నాటి చంద్రబాబు ప్రభుత్వం 279జి.వోను, నిన్నటి జగన్ ప్రభుత్వం ఆప్కాస్, నేడు కూటమి ప్రభుత్వం బడా కంపెనీలంటూ తిరిగి ప్రైవేట్ జపం చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు.గుత్త పెట్టుబడిదారులకు సంపద సృష్టించే యంత్రాలుగా కార్మికులను చూడడం సరైంది కాదన్నారు. రిటైర్మెంట్ కార్మికుల స్థానాల్లో నూతన రిక్రూట్మెంట్ లేకపోవడం వెరసి పనిచేస్తున్నటువంటి తక్కువగా ఉన్న సిబ్బందిపైనే పని భారం తీవ్రంగా పడడంతో కార్మికులు అనారోగ్యాల బారిన పడుతున్నా రన్నారు. సత్వరం జనాభా అనుగుణంగా కార్మికు సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమా వేశంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు బంగారు దుర్గాప్రసాద్, ఎలగాడి అనురాధ, ఓరత్త బాలు, బొచ్చ రాజేష్ కుమార్, సొంగ మరియదాసు, వెంకటేశ్వరరావు, ఎలగాడి రాము, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పాఠశాలలు కొనసాగించాలి

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఏజెన్సీ ప్రాంతంలోని ఉన్న పాఠశాలలు కొనసాగించాలని ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం మోడల్ స్కూల్ పేరుతో పలు గ్రామాల్లోని పాఠశాలలు రద్దు చేయాలనుకోవడం సమంజసం కాదన్నారు. స్థానికంగా ఉన్న పాఠశాలలకు విద్యార్థులు అధికసంఖ్యలో వస్తారని అన్నారు. దూర ప్రాంతంలో పాఠశాలలు ఏర్పాటు చేయటం వలన పిల్లలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. స్థానిక పాఠశాలలు అభివృద్ధి చేయాలన్నారు. గిరిజన ప్రాంతాలలో ఉన్న పాఠశాలలు మార్చ వద్దని. ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

గీత కార్మికులకు కేటాయించిన షాపులు నేడు లాటరీ

విశాలాంధ్ర -భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లాలో గీత కులాలకు కేటాయించిన 18 షాపులకు గురువారం భీమవరం జిల్లా కలెక్టర్ ఆఫీసు పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3.00 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో లాటరీ ద్వారా షాపులు కేటాయించబడతాయని డాక్టర్ ఆర్.ఎస్ కుమరేశ్వరన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు., ధరఖాస్తుదారులందరు మధ్యాహ్నం 3.00 గంటలకు పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంకు రావాల్సిందిగా కోరారు.

ప్రతి ఒక్క దరఖాస్తుదారుడు ధరఖాస్తుతోపాటు ఎంట్రీ పాస్, కుల ధ్రువికరణ సర్టిఫికెట్, ఆథరైజేషన్ లెటర్ మొదలగు సంబంధిత పత్రాలను తీసుకురావాలని, 2025-26వ సంవత్సరమునకు గాను, రూ. 16,04,167 నుండి 18,95,833 కనిష్ట మరియు గరిష్ట లైసెన్సు ఫీజుగా గవర్నమెంట్ వారు నిర్ణయించినట్టు తెలిపారు.

నేడు మద్యం షాపులకు టెండర్

విశాలాంధ్ర -దేవరపల్లి: దేవరపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దేవరపల్లి గోపాలపురం మండలాలలో గీత కులాలకు కేటాయించిన రెండు షాపులకు 6న గురువారం ఉదయం 10 గంటలక రాజమహేంద్రవరం డ్రా తీయటం జరుగుతుందని దేవరపల్లి ఎక్సైజ్ సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం దేవరపల్లి సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో ఒక షాపు కుదేవరపల్లి మండలంనుంచి 39 దరఖాస్తులు వచ్చాయన్నారు గోపాల పురం మండలానికి 43 దరఖాస్తు అందాయని సీఐ బళ్ల శ్రీనివాస్ తెలిపారు. దేవరపల్లి గోపాలపురం మండలానికి సంబంధించి రెండు షాపులకు రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో డ్రా తీస్తారనితెలిపారు దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఎంట్రీ పాసులు తీసుకురావాలని సిఐ శ్రీనివాసరావు కోరారు.

విద్యార్థినీలకు డ్రాయింగ్ పోటీలు

విశాలాంధ్ర-దేవరపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం దేవరపల్లిలో గల చైతన్య స్కూల్లో విద్యార్థినీలకు పెయింటింగ్ విభాగంలో (డ్రాయింగ్) పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి సుబ్రహ్మణ్యం, స్కూల్ యాజమాన్యం దేవరపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ విజయ శ్రీ, పోలీస్ కానిస్టేబుల్ ఆర్ వెంకటరమణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆబోతును చంపిన నిందితులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం వీరవరం గ్రామంలో కలియుగ దైవంగా కొలవబడే ఎద్దు ఆబోతును కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బలవంతంగా హత్య చేసి స్మశాన వాటికలో పూడ్చివేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు హైందవ సంఘాలు కడియం పోలీస్ స్టేషన్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

అసత్య ప్రచారాలతో యువత మోసపోవద్దు : షర్మిళ అశోక్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : తమ సంస్థ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు సోషల్ మాధ్యమంలో పెట్టిన అసత్య ప్రచారాలను నమ్మి నిరుద్యోగ యువత మోసపోవద్దనీ తూర్పు గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి కుమారి కె.షర్మిళ అశోక హెచ్చరించారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటనను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి కె.షర్మిళ అశోక మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో(ఏపీఎస్ ఆర్టీసీ)లో ఉద్యోగ అవకాశాలు అనే అంశంతో సోషల్ మీడియాలో కొంతమంది తప్పుడు ప్రచారం పోస్టు పెట్టినట్లు తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపోలో వివిధ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయనున్నట్లు, వాటిలో భాగంగా 18 ఏళ్లు నుండి 40 ఏళ్లు లోపు ఉన్న టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, బీటెక్, బి ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ,తదితర డిగ్రీలతో అర్హులైన నిరోద్యగ యువతకు నెలకు రూ.23 వేలు నుంచి రూ: 58 వేలు సూచిస్తూ గుర్తు తెలియని వ్యక్తి తప్పుడు ప్రచారం పోస్టు చేసినట్లు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 9133566236 నెంబర్ ఫోన్ చెయ్యాలని సూచినట్లు గుర్తించామన్నారు. సదరు ప్రకటనకు ఆర్టీసీకి ఏ విధమైన సంబంధం లేదని స్పష్టం చేశారు. అటువంటి అసత్య ప్రచారాలు నమ్మవద్దని ,ఎవరైనా నమ్మి మోసపోతే ఆర్టీసీ ఎట్టి పరిస్థితుల్లో బాధ్యత వహించదని హెచ్చరించారు.

ముగిసిన మగ్గం శిక్షణ

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని మొరంపూడి వద్ద రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొంత కాలంగా ఉచితంగా అందించిన మగ్గం శిక్షణ తరగతులు బుధవారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కింగ్ ప్యారడైజ్ అధ్యక్షులు ప్రసాద్, ఫౌండేషన్ అధినేత డాక్టర్ సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేర్చుకున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక క్రమశిక్షణతో పిల్లలని పెంచాలని, తద్వారా పిల్లలు భవిష్యత్తులో చెడు అలవాట్లు లోనవ్వరని సూచించారు. ఉన్నదాంట్లో సర్దుకుని బ్రతకడం నేర్చుకుంటారని, తెలియజేస్తూ తల్లుల పాత్రకి ప్రాధాన్యతనీ తెలిపారు. శిక్షణ ముగించుకున్న సుమారు 60 మంది మహిళలకి ధ్రువ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, శిక్షకురాలు కోనే లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు కీర్తి, నాగమణి, లక్ష్మి, మీనా తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ శ్రీనివాస్‌పై ఫిర్యాదు

విశాలాంధ్ర - అమలాపురం : రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు మొదటి రోజులో భాగంగా వైయస్సార్సీపి ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ పవన్ కళ్యాణ్‌పై జనసైనికులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు పిలుపు మేరకు ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలగుప్తం ఎంపీటీసీ తాళ్ళ లలిత, గ్రామకమిటీ అధ్యక్షులు చిక్కం వెంకటకృష్ణ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు నాగులపల్లి రాజు బిక్కిన ఏసు, ఆకెటి శీను, ఆకేటి వెంకన్న, గనిశెట్టి లలితా శ్రీనివాస్, గొల్లకోటి వెంకటేష్, పినిశెట్టి సురేష్, కోడి శివ, చిక్కం బన్ను కోటూరి వీరాస్వామి సలాది తాతారావు విజ్జు, నాగులపల్లి పరశురామ్ గారపాటి సత్తిరాజు సునీల్, ఆదిమూలం మహేంద్ర జనసేన నాయకులు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - జగ్గంపేట : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా జగ్గంపేటలో ఐసీడీఎస్ అధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్దాపురం డిఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట ప్రాజెక్ట్ అధికారిణి సిడిపిఒ ఎమ్ పూర్ణిమ, స్థానిక సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌లు అంగన్వాడీ సిబ్బందితో కలిసి అమ్మాయిలను చదివించాలని, బాల్య వివాహాలు చేయకూడదనే ప్లకార్డులతో సర్కిల్ కార్యాలయం నుండి బయలుదేరి సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చిన్నారులకు గుడ్‌సీడ్ వస్తువుల వితరణ

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ సింగరాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు గుడ్ సీడ్ ఫౌండేషన్ వితరణ చూపింది. సర్పంచ్ పెయ్యల రాజ్ కుమార్ అధ్యక్షతన బుధవారం అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పాదరక్షలు, సాక్స్‌లను గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు అందజేశారు. అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారుల విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని రమణారావు కోరారు. ఈ సందర్భంగా రమణారావు అందిస్తున్న సేవా కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో అంగన్ వాడి సూపర్ వైజర్ మట్టపర్తి రమాదేవి, పాఠశాల హెచ్ఎం గాలిదేవర కృష్ణారావు, అంగన్ వాడి టీచర్లు డి సుశీల, డి నాగ కుమారి, కె విజయలక్ష్మి, ఎస్ మీరాబాయి, కెవి సత్యవతి, ఎన్‌వివిఎల్ నరసాయమ్మ, టి తులసిలక్ష్మి, పి సంధ్యారాణి పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - గండేపల్లి : ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగం వారి ఆధ్వర్యంలో బుధవారం “సైబర్ సెక్యూరిటీ ఇన్ ది ఎరా ఆఫ్ AIఅను అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించామని కళాశాల చైర్మన్ డా పరుచూరి కృష్ణారావు తెలియచేసారు. ఈ కార్యక్రమానికి వక్తగా డా టి శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, సిఎస్‌సి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జెఎన్‌టియుకె, కాకినాడ వారు మాట్లాడుతూ, సైబర్ క్రైమ్స్ ద్వారా ఎదురయ్యే సమస్యల నుంచి బయటపడేందుకు 'సైబర్ సెక్యూరిటీ' ఎటువంటి ప్రాముఖ్యత వహిస్తుందో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా జి నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్ళాలని తమను తాము మెరుగు పరుచుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎంవి హరనాధబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం సతీష్, డైరక్టర్-అకడమిక్స్ డా కె సత్యనారాయణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధికారిణి కె లక్ష్మి వివేక, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాజన సభ సమావేశపు నోటీసు

ది. గౌతమీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ లిమిటెడ్ నెం. డి. 1440, రాజమండ్రి వారి మహాజన సభ సమావేశము ది. 25-03-2025వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3.00గం॥లకు సూపరుబజారు కార్యాలయమునందు అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి ఎం. కనకదుర్గారెడ్డి గారి అధ్యక్షతన జరుపబడును. కావున సంఘ సభ్యులు ఎల్లరు సదరు సమావేశమునకు హాజరు కావలసిందిగా కోరడమైనది.

రాజమహేంద్రవరం
ది. 24-02-2025

ఎం. కనకదుర్గారెడ్డి, అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి,
ది. గౌతమీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ లిమిటెడ్,
నెం. డి. 1440 - రాజమండ్రి

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కడియం : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని కడియం ఎస్సై బి నాగ దుర్గాప్రసాద్ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడియం ఏవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమా నికి పాఠశాల ఇన్ చార్జ్ ప్రధానోపాధ్యాయులు రఫీ యుద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కడియం ఎస్ఐ బి నాగ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మహిళా రక్షణ కోసం అనేక చట్టాలు న్నాయని, వాటిలో పోక్సో చట్టం ముఖ్యమైందని తెలిపారు. చదువు అసమానతలను దూరం చేస్తుం దని, ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని తెలియజేశారు. వ్యాసరచన, డ్రాయింగ్ విజేతలైన దీపిక, గౌతమి, హారిక, సత్య ప్రియాంక, స్నేహ

అక్షయ, హేమశృతులకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయినీలు లీలావతి, పద్మజ, విద్యార్థినీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు

విశాలాంధ్ర - కడియం : పవిత్ర రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. మండల కేంద్రమైన కడియం గ్రామంలో గల మసీద్ ఏ కౌసర్ వద్ద సంప్రదాయబద్ధంగా ఉదయం సహేర్‌తోరోజా దీక్షలను చేపట్టారు. సుమారు 14 గంటల పాటు ఉపవాసం పాటించి, సాయంత్రం కమిటీ ప్రెసిడెంట్ షేక్ సలీం మరియు సెక్రెటరీ సర్కార్ భాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మసీదులో ముస్లిం పెద్దలతో కలిసి ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించిన పవిత్ర రంజాన్ మాసంలో ప్రతీ రోజూ అల్లాని స్మరించుకుంటూ కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తూ, తమ పాపాలను శుద్ధి చేసుకునే గొప్ప అవకాశంగా భావించాలన్నారు. ఈ పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలను భక్తి శ్రద్ధలతో విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలో ముస్లిం సోదరులు, మత పెద్దలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం, నైపుణంపై శిక్షణ

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : పిఠాపురం ఐసిడిస్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస అండ్ నైపుణ్య శిక్షణా తరగతి యు కొత్తపల్లి మండలం, వాకతిప్ప జడ్పీ హైస్కూల్‌లో టెన్త్‌క్లాస్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి అరుణా దేవి మాట్లాడుతూ పిల్లల్లో చదువు యొక్క విలువలు, జరగబోయే పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవ్వాలని, విద్యార్థులు క్రమశిక్షణగా ఎలా ఉండాలని మాట్లాడారు. ఈ శిక్షణా కార్యక్రమానికి, స్కూల్ ఉపాధ్యాయుడు కృపా రావు, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ అనంత లక్ష్మి, సారమ్మ, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగవేలం ప్రకటన

జిల్లా సమాచార మరియు పౌరసంబంధాల అధికారి, రూమ్‌నెం. 201, రెండవ అంతస్తు, ఎయిమ్స్‌కాలేజి, ముమ్మిడివరం వారి కార్యాలయంలో వాహనం 1989సం॥ మోడల్ ఆల్విన్ నిస్సాన్ క్యాబ్‌స్టార్ రి.నెం.ఎ.హెచ్.ఒ. 7932 ప్రస్తుతం ఎలా వున్నదో అలా తేది 18.03.2025 ఉదయం 11గంటలకు బహిరంగవేలం వేయుటకు నిర్ణయించడమైనది.

1)పాటలో పాల్గొనేవారు ముందుగా రూ.1000/నగదు దరఖాస్తు చెల్లించాలి. వేలం ముగిసిన తదుపరి ధరావత్తు తిరిగి ఇవ్వబడును. వేలంపాట అధికంగా పాడి దక్కించుకున్నవారు. 18శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాలి. 2) ఈ వేలం నిలుపుదల, మార్పులు,రద్దు చేయుటకు కార్యాలయ అధికారివారికి పూర్తి అధికారం కలదు. ఆఫీసు పనివేళల్లో వాహనం పరిశీలించ వచ్చును.

జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి
సమాచార పౌరసంబంధాలశాఖ
డా॥ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమజిల్లా

విద్యార్థుల భద్రతపై అవగాహన : సీఐ

విశాలాంధ్ర - సీతానగరం: ప్రయివేటు పాఠశాల బస్సులలో విద్యార్థుల భద్రత చాలా ముఖ్యం అని కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్య కిషోర్ అన్నారు. మండలంలోని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం, బస్సు డ్రైవర్లు క్లీనర్లతో విద్యార్థుల భద్రతపై సిఐ సత్య కిషోర్, ఎస్ఐ రామ్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల రవాణా వ్యవస్థ అయినా పాఠశాలల బస్సులలో ప్రయాణించే విద్యార్థులు భద్రత పట్ల పాఠశాల యాజ మాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే పాఠశాలల బస్సులను నడిపించే డ్రైవర్లు క్లీనర్లు విద్యార్థులు దిగుతున్నప్పుడు, ఎక్కుతున్నప్పుడు పూర్తి అయే వరకూ క్లీనర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు దాటేవరకు విద్యార్థి వెంట ఉండాలని అన్నారు. అలాగే పాఠశాల యాజమాన్యం బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు రెన్యువల్ చేయించుకోవాలని ఆదేశించారు. యాజమాన్యం నియమించే డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్సులు ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థి భద్రతపై యాజమాన్యం ఎప్పటికప్పుడు పాఠశాల బస్సులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. నియమ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దన్నారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో మండలంలో అన్ని ప్రయివేటు పాఠశాల యాజమాన్యం, డ్రైవర్లు, క్లీనర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా సభ్యుల ఉత్పత్తులకు మార్కెట్

విశాలాంధ్ర - అనపర్తి : స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే సదుపాయాన్ని కల్పించినట్లు జిల్లా మండలాలు గ్రామీణాభివృద్ధి సంస్థ శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం ధర్మేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక స్థానిక విలేకరులతో ధర్మేంద్ర మాట్లాడుతూ ఓ ఎన్ డి సి ఓపెన్ నెట్వర్క్ ఫర్ డిపాజిట్ కామర్స్ విధానం ద్వారా ఆన్లైన్ సేల్స్‌పై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళా శక్తి సంఘాల సభ్యులు తయారు చేస్తున్న వస్తువులకు మార్కెట్లో మంచి స్పందన వస్తుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 73 వేల 250 మంది డ్వాక్రా గ్రూప్ సభ్యులు ఉన్నారని వీరికి 2024-25 గాను రూ.4.35 కోట్ల రూపాయలు రుణాలు యిచ్చినట్లు ఏజీఎం వివరించారు. జిల్లాలో 23,557 మందికి రూ.135 కోట్లు రుణాలు కాకినాడ జిల్లా లో 1774 మంది సభ్యులకు రూ.125 కోట్లు. అలాగే అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 31,949 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.175 కోట్ల రుణాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ పనిముట్లకు. పాలు, పాలు పదార్థాలకు సంబంధించి రుణాల మంజూరులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. బట్టల వ్యాపారం. తినుబండారాల తయారీ. కిరాణ.పూతరేకులతయారీ, కొబ్బరి ఉత్పత్తులు తయారీదారులకు రుణాలు ఇస్తున్నామన్నారు. జీవనోపాధి రుణాలు కూడా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. 18 నుండి 60 సంవత్సరాల లోపు ఉన్న మహిళలను డ్వాక్రా గ్రూప్ సభ్యులుగా అర్హులని, ఒక్కొక్క గ్రూపుకు లక్ష రూపాయలు రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా గ్రూపులోని లేని సభ్యులను చేర్పించి వారికి ప్రోత్సాహక రుణాలు అందజేయన్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మేనేజర్ రాజు,ఏపీఎం వీరమల్ల రాజా బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయం పునర్నిర్మాణ మహాకుంభాభిషేక మహోత్సవం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం దుద్దుకూరులో దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో శ్రీ సీతారామ స్వామి ఆలయం పునర్నిర్మాణం చేశారు. ఈనెల 6న గురువారం నుంచి 9 ఆదివారం వరకు పునర్ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన రావిపాటి వరప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన రంగాచార్యులు పునర్ ప్రతిష్ట కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు సుమారు రెండు కోట్ల రూపాయలు వ్యయంతో నిర్మించిన పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆరవ తేదీ గురువారం శోభాయాత్ర గ్రామ దేవత ముత్యాలమ్మ మహా లక్ష్మమ్మ అమ్మవార్లకు పసుపు కుంకుమ చీర సారే పానకములు ఆలయ కమిటీ వారిచే సమర్పించి పూజ కార్యక్రమాలు చేపడతారు సాయంత్రం గణపతి పూజ ఆరాధన పుణ్యవచనం తదితర కార్యక్రమాలు చేపట్టి తీర్థప్రసాదాలు అందచేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఏడవ తేది శుక్రవారం ఉదయం విశ్వక్సేన పూజ పంచగవ్యాచన అగ్ని ప్రతిష్టాపన. 8న ఉదయం విశ్వక్సేన పూజ పాయస హెూమం మహా శాంతి హెూమం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9 ఉదయం విశ్వక్సేన పూజ ఉదయం పది గంటల 52 నిమిషములకు పునర్వసు నక్షత్ర యుక్త వృషభ లగ్న పుష్కరాంశమునందు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు . ఆదివారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ సీతారామ స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభముగా జరుగుతుందన్నారు.

8న ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ సమావేశం

విశాలాంధ్ర - రావులపాలెం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్‌సి క్లబ్ నందు ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ మీటింగ్ 8న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ల సంఘ అధ్యక్షులు టి అబ్బులు తెలిపారు. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కోమర దశ బాలికలకు ఉపయోగపడే సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలు ఇవ్వకుండా దుర్వినియోగం చేయుచున్న కాంట్రాక్టర్ దారులపై మాస్టర్ల అసోసియేషన్ నిర్ణయం అసోసియేషన్ మాస్టర్ల సభ్యత్వం, వేసాకాలం సెలవులలో చిన్నారులకు ఉచిత శిక్షణ తరగతుల ఏర్పాటు కోసం వివిధ విషయాలను చర్చించడం జరుగుతుంది. ఈ సమావేశానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా చుట్టుపక్కల మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ లందరూ ఈ సమావేశానికి రావాలని ఆయన కోరారు.

వెంకన్నను దర్శించుకున్న గుజరాత్ భక్త బృందం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ఖ్యాతి గాంచిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని బుధవారం గుజరాత్ రాష్ట్రానికి చెందిన భక్తులు దర్శించుకున్నారు. సుమారు 30 మంది భక్త బృందం స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ బృందంలో అధికంగా ఉన్న మహిళలు గోవింద నామస్మరణ చేశారు. ఎంతో పురాతన స్వయంభూ క్షేత్రమైన ఈ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి విశిష్టతను తెలుసుకుని గుజరాత్ రాష్ట్రం నుంచి వచ్చామని భక్తులు తెలిపారు. ఆలయంలో భక్తులకు ఏర్పాట్లు బాగున్నాయని చెప్పారు. స్వామి వారిని కీర్తిస్తూ గీతాలు ఆలపిస్తూ సందడి చేసారు.

గంజాయి బ్యాచ్ అరెస్టు

విశాలాంధ్ర - తాళ్లరేవు : కాకినాడ జిల్లా, తాళ్ళరేవు మండలం కోరంగి సీతారామపురం లే అవుట్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిలో ఎనిమిది మంది గంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకొని ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న కోరంగి పోలీసులు కోరంగి ఎస్సై సత్యనారాయణ రెడ్డికు అందిన సమాచారం మేరకు కోరంగి పోలీసు సిబ్బంది డిప్యూటీ తహశీల్దార్‌తో కలిసి గంజాయి బ్యాచ్‌పై మెరుపు దాడి చేయగా ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకుని వారి వద్ద ఉన్న ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

టీ కేఎం నుంచి మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ గ్రేడ్‌లో లెజెండర్

విశాలాంధ్ర-రాజమండ్రి: అధిక పనితీరు, సాహసోపేతమైన స్టైలిష్ ఎస్యూవీ లకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చటానికి, టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకే ఎం) ఈరోజు టొయోటా లెజెండర్ 4X4 యొక్క మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్‌ను ప్రవేశపెట్టింది. థ్రిల్ కోరుకునే డ్రైవింగ్ ప్రేమికుల కోసం రూపొందించబడిన ఈ కొత్త వేరియంట్, శక్తి, లగ్జరీ మరియు అత్యాధునిక సాంకేతికత యొక్క పరిపూర్ణ సమ్మేళనాన్ని అందిస్తుందని టీ కే ఎం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా చెప్పారు. లెజెండర్, 2021లో అధునాతన 4X4 సామర్థ్యాలతో భారతదేశంలోకి అడుగుపెట్టిం దన్నారు. లెజెండర్ 4X4 ఎంటీలో 2.8లీ డీజిల్ ఇంజిన్ ఉంది, ఇది 204 పీ ఎస్ పవర్ మరియు 420 ఎన్ ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందన్నారు. 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఖచ్చితత్వాన్ని పెంచుతుందని, టొయోటా యొక్క అధునాతన 4X4 టెక్నాలజీ డ్రైవర్లకు విభిన్న ఆఫ్-రోడ్ ఎస్కేప్‌లకు ఆదర్శవంతమైన సహచరుడిగా చేస్తుందన్నారు. లెజెండర్ 4X4 ఏం పరిచయం గురించి విలువైన కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న డిమాండ్లు మరియు ప్రాధాన్యతలకు ప్రతిస్పందనగా ప్రత్యేకంగా రూపొందించబడిన టొయోటా లెజెండర్ యొక్క కొత్త గ్రేడ్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రీమియం ఎస్ యూ వీ ఎక్సలెన్స్ యొక్క సరిహద్దులను మేము అధిగమించేటప్పుడు మార్కెట్లో కీలకమైన అంతరాన్ని పరిష్కరిస్తున్నామని మేము విశ్వసిస్తున్నాము" అని అన్నారు. లెజెండర్ 4X4 ఎం టీ కోసం బుకింగ్‌లు ఇప్పుడు తెరిచి ఉన్నాయని, కస్టమర్లు తమ సమీప టొయోటా డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చు లేదా టొయోటా భారత్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు అని చెప్పారు.

శిలాఫలకం ధ్వంసం నిందితులను శిక్షించాలి

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు, కోరంగి పంచాయతీ సీతారామపురంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాని నిరసిస్తూ వైఎస్ఆర్‌సిపి నాయకులు ఆందోళన చేశారు. బుధవారం స్థానిక చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామ రహదారినుంచి కాలభైరవస్వామి ఆలయానికి వెళ్లేందుకుగానూ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సుమారు రూ.15 లక్షలు వెచ్చించి సీసీ రహదారిని నిర్మించారు. దీనికి సంబంధించిన శిలఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఆందోళన చేశారు. ఎస్సై పి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, నాయకులు మల్లాడి శ్రీను, వెంటపల్లి సూకరాజు, దడాల జగదీశ్వరరావు, పేర్ని ఆదినారాయణమూర్తి, పెట్ల సూర్యనారాయణ రాజు, పోతుల రత్నకుమారి, కోటికలపూడి చందు

నిరంతర శ్రామికుడు రామ్మోహన్

విశాలాంధ్ర కొవ్వూరు : కార్మికుల సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమించిన మహనీయుడు స్వర్గీయ పి రామ్మోహన్ అని కొవ్వూరు ఆర్టిసి డిపో ఎన్ ఎం యు సెక్రెటరీ శివ అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయం నందు ఉన్న నేషనల్ మజ్దూర్ యూనియన్ స్థూపం వద్ద వ్యవస్థాపక అధ్యక్షులు పి రామ్మోహన్ 20వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్గీయ పి రామ్మోహన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ శివ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఆనాడు నేషనల్ మజ్దూర్ యూనియన్‌ను స్థాపించి అంచల అంచెలుగా యూనియన్ అభివృద్ధి పరుస్తూ రాష్ట్రంలోనే అతిపెద్ద యూనియన్‌గా బలపడి కార్మికులకు అండగా నిలుస్తున్న యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ అన్నారు. ఎందరో కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపిన మహనీయుడు పి రామ్మోహన్ రావు అని ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్క కార్మికుడు కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు అధ్యక్షులు ఏ రాజు, రీజనల్ సిహెచ్ ముఖర్జీ, గ్యారేజ్ సెక్రెటరీ సిహెచ్ శివ, రీజనల్ చైర్మన్ వి వి టి ప్రసాద్, డిపో చైర్మన్ కే రమణ, గ్యారేజ్ జాయింట్ సెక్రెటరీ ఎం రవి, తదితర నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి : సీఐ

విశాలాంధ్ర - సామర్లకోట : నేటి బాలికలే రేపటి మహిళలని, మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా ప్రగతి పదంలో పయనించడానికి అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సామర్లకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన మార్చి 8న జరుగనున్న అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియాలను పరిమితంగా వాడుకొని ప్రయోజనం పొందవచ్చు అని, అదే సమయంలో దాని దుష్ప్రభావాలు బారిన పడకుండా అవగాహన కల్పించారు. మంచి అలవాట్లు కలిగి ఉన్నత స్థితికి చేరాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సాయి రామకృష్ణ మాట్లాడుతూ మనదేశ రాష్ట్ర పతి ద్రౌపది ముర్ము, శకుంతలా దేవి, కల్పనా చావ్లా, సింధు, సునీత విలియమ్స్ వంటి వారి నుండి విద్యార్థినిలు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు.

మేనేజర్ వైఖరికి నిరసనగా ఆందోళన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : స్థానిక ఆర్టిసి డిపో మేనేజర్ మొండి వైఖరిని నిరసిస్తూ డిపో ఉద్యోగ కార్మికులు గత 12 రోజులుగా ఆందోళన బాట పట్టారు. సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. డ్రైవర్ ఎస్వి.రమణ అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఏలేశ్వరం ఆర్టీసీ డిపోలో ఉన్న అన్ని యూనియన్లు జేఏసీగా ఏర్పడి సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ మేరకు జేఏసీ కన్వీనర్ యుబిఎం కుమార్ మాట్లాడుతూ 1/2019 జీవోను డిపో మేనేజర్ తుంగలోకి తొక్కి కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు. మరొక జేఏసీ కన్వీనర్ కే త్రిమూర్తులు మాట్లాడుతూ 1/2019 జీవో కు వ్యతిరేకంగా డిపో మేనేజర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్ రమణను జీవోకు వ్యతిరేకంగా సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ గత 12 రోజులుగా ఎర్ర రిబ్బన్లు ధరించి విధులకు హాజరై మధ్యాహ్నం డిపో గేట్ మీటింగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డిపో మేనేజర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ జీవో 1/2019 ఖచ్చితంగా అమలు చేసి డ్రైవర్ ఎస్వి రమణ తిరిగి విధులలోనికి తీసుకోవాలని అలా లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. డ్రైవర్లు పి బాలరాజు, సిహెచ్ లోవరాజు నిరాహార దీక్షలో కూర్చుని సంఘీభావం తెలిపారు. అనంతరం మధ్యాహ్నం గేటు మీటింగ్ వద్ద కార్మికులు 11వ రోజు ఆందోళన బాటపట్టారు. ఈ ఆందోళన కార్యక్రమంలో భీమన సూరిబాబు, ఎన్‌వీరావు, కే ప్రవీణ్, చలం, చిన్నబాబు, వీరవరం శ్రీను, ఎల్ఎన్ రావు, జక్కా శ్రీను, ఎస్ఎస్ కుమార్, మహిళా కండక్టర్లు రాజ్యలక్ష్మి, సిహెచ్ వెంకటలక్ష్మి, పల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం



విశాలాంధ్ర - రాజానగరం : దేహదారుఢ్యం తో పాటుగా ఆత్మస్థైర్యానికి సైతం క్రీడలు దోహద పడతాయనీ లాలాచెరువు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు రాయుడు శ్రీనివాస్, కడియం రైల్వే బోర్డు సభ్యులు బొమ్మల సతీష్ అన్నారు. జిల్లా కేంద్రమైన కాకినాడలో గతనెల 16న జరిగిన తైక్వాండో జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని హౌసింగ్ బోర్డుకు చెందిన కోచ్ పి.యశ్వంతి నేతృత్వంలో ఏడుగురు క్రీడాకారులు హాజరుకాగా వారిలో ఆరుగురు పసిడి పతకాలు, ఒక్కరు రజిత పథకాలు సాధించడంతో స్థానిక అంబేద్కర్ పార్కు వద్ద జరిగిన అభినందన సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎన్డీఏ కూటమి నాయకులు విజేతలకు పతకాలు అందించి,అభినందనలు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు,విద్య నేర్పిన గురువులకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షులు బొర్రా వెంకటేశ్వరరావు, మద్దుల వినోద్, బొర్రా బాలు, మెండి దుర్గా ప్రసాద్, మేఘన కిషనాకిశోర్ నూలు బాబీ ప్రసాద్, ఆర్ కె తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి వివేకానంద సేవా సమితి ఖనన

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వివేకానంద సేవా సమితి సభ్యులు అనాథ శవానికి ఖనన కార్యక్రమం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెలితే కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురం గ్రామానికి చెందిన కిర్లంపూడి సూర్యనారాయణ (75) గత కొన్ని రోజులుగా యర్రవరం జాతీయ రహదారిపై దీన స్థితిలో ఉండటంతో అది గమనించిన వివేకానంద సేవా సమితి సభ్యులు అతని వివరాలు సేకరించి ప్రత్తిపాడు శారదా వయో వృద్ధాశ్రమంలో చేర్పించారు. అయితే అతనికి మంగళవారం రాత్రి అనారోగ్యం కారణంగా ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆరోగ్యం క్షీణించడంతో సూర్యనారాయణ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివేకానంద సేవాసమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు అనాధ శవానికి అన్నీ తానై దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ ఖనన కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వాగు రాజేష్, తొమ్మిదోవ వార్డ్ టిడిపి ఇంచార్జ్ బుగతా శ్రీను, హెడ్ కానిస్టేబుల్ పాండ్రంకి రామకృష్ణ, రాతికింద సతీష్, అడపా సుబ్రహ్మణ్యం, తాపీమేస్త్రి శంకర్, కర్రి రాంబాబు, పెండ్యాల రాజు, స్వీపర్లు అల్లం శివ, బంగారు దుర్గారావు పాల్గొన్నారు.

ఇంటి పన్ను 100 శాతం వసూలు చేయాలి

విశాలాంధ్ర - కరప : కరప మండలం ఉప్పలంక గ్రామంలో ఇంటి పనులు 100% వసూలు చేసే విధంగా పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, కృషి చేయాలని మండల పంచాయతీ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఉప్పలంక గ్రామంలో శ్రీనివాసరావు పర్యటించి ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో వచ్చే వ్యర్థాలను తడి పొడిగా విభజించి సంపద కేంద్రాల తరలించి సేంద్రియ ఎరువుల తయారు చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మల్లాడి భవాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రతి ఒక్క పాడి రైతులు ఈ నెల 31 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ జెడి ఆర్ వెంకటేశ్వర్లరావు కోరారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలంలో వెటర్నరీ సిబ్బందిని 22050 డోసుల వినియోగం కోసం 8 టీంలుగా వేయటం జరిగిందన్నారు. ప్రతి టీం వారి పరిధిలో ఉదయం 7.00 గం.ల నుండి 10.00 గం.ల వరకు ఈ టీకాలు వేస్తారని తెలిపారు. 6 నెలలు పై బడిన ప్రతి పశువుకు కూడా ఈ టీకా వేయించాలన్నారు. అంతే కాకుండా దీనిలో భాగంగా 4 నుండి 8 నెలల లోపు ఉన్న పెయ్యి దూడలను గుర్తించి వాటికి విడిగా బ్రూసెల్ వ్యాధి నివారణ టీకాలు వేయటం జరుగుతుందన్నారు. బుధవారం కాకినాడ వెటర్నరీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ వెంకటేశ్వరరావు ఈ రెండు మండలంలో జరుగుతున్న టీకాల కార్యక్రమం పై విస్తృత స్థాయిలో తనిఖీ, పర్యటనలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ ప్రత్తిపాడు డాక్టర్ చిక్కం బాల చంద్ర యోగేశ్వర్, మండల వెటర్నరీ, ధర్మవరం వైద్యాధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి : జేసీ

విశాలాంధ్ర-భీమడోలు: అంగన్వాడీ కేంద్రాలలో మహిళలు, పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. భీమడోలు మండలంలో బుధవారం జేసీ సుడిగాలి పర్యటన చేసి వివిధ శాఖల పనులను పరిశీలించారు. పాతూరులోని ఎంపీపీ స్కూల్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జేసీ సందర్శించి, అక్కడ మహిళలు, పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ మహి ళలు, పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత నివారించడం ద్వారా మాతా ,శిశు మరణాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన పౌష్టికాహారాన్ని మహిళలు, పిల్లలకు అందించేలా అంగన్వాడీ సిబ్బంది పనిచేయాల న్నారు. అంగన్వాడీలోని ప్రీ స్కూల్ లో పిల్లలకు విద్య పట్ల ఆసక్తి కలిగేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు కాలువలో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులను జేసీ పరిశీలించారు. తూడు,గుర్రపుడెక్క తొలగింపు పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేసి, శివారు గ్రామాలకు తాగు, సాగు నీరు అందేలా చూడాలన్నారు. తరువాత వివిధ కార్యక్రమంల్లో పాల్గొన్నారు.జాయింట్ కలెక్టర్ వెంట ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఇరిగేషన్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. నాగార్జునరావు, సర్వే ఏడి అన్సారి,తహసీల్దార్ రమాదేవి, ఐసిడి ఎస్ సిబ్బంది, ప్రభుత్వులు పాల్గొన్నారు.

492 కేజీల గంజాయి స్వాధీనం

8 మంది నిందితుల అరెస్టు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట జగనన్న కాలనీలో 492 కేజీల గంజాయిని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. సర్కిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆ వివరాలను వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని ఇక్కడకు తీసుకువచ్చి, ఇక్కడ నుంచి తమిళనాడు, కర్నాటక వంటి ప్రాంతాల వారికి విక్రయించడం జరుగుతుందన్నారు. ఈ కేసులో 8 మందిని అరెస్టు చేసి, కారు, బైక్, 7 మొబైల్స్, రూ.2.78 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తిని, కర్నాటకకు చెందిన ఒకరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వీటి మొత్తం విలువ రూ.30 లక్షల 52 వేలు ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపడం జరిగిందని, దాని కోసం ఈగల్ అనే డిపార్ట్మెంట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ వైఆర్‌కె శ్రీనివాస్, కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి ఎస్‌ఐలు సతీష్, టి రఘునాథరావు, శివనాగబాబు, సిబ్బందిని ఆయన అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో పెద్దాపురం డిఎస్పీ శ్రీహరి రాజు పాల్గొన్నారు.

పిల్లలను ఆదరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర -భీమవరం: కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల బాధ్యతలను చూసే కుటుంబ సభ్యులు, సంరక్షకుల సేవలు అభినందనీయం, ఆదర్శనీయమని కలెక్టరు చదలవాడ నాగరాణి బుధవారం కలెక్టరేటు పి.జి.ఆర్.యస్ సమావేశ మందిరంలో జిల్లా ఐసిడియస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య స్కీమ్ కింద స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్ ద్వారా కరోనా బాధిత పిల్లలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా బాధిత పిల్లలకు ప్రేమ ఆప్యాయత లను పంచి సమాజంలో ఉన్నత స్థానాలకు చేరే విధంగా మనమంతా కృషి చేయాలని, కష్టాలు, పేదరికం పోవా లంటే విద్య ఒక్కటే రాజమార్గమని అన్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా సాయం పొంది బాగా చదువు కుంటున్నామని, మాకు ఎటువంటి ఇబ్బందులు లేవని, మాకు అప్పుడప్పుడు చనిపోయిన తల్లిదండ్రులు గుర్తుకొస్తు న్నారని బాధిత పిల్లలు కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనిపై స్పం దించిన కలెక్టరు భాధా హృదయంతో పిల్లలను దగ్గరికి తీసుకుని ధైర్యం చెప్పారు. ప్రతి ఒక్కరిని పలకరించి ఏమి చదువుచున్నారు, మీ కుటుంబ సభ్యులు బాగా చూసుకుంటున్నారా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని తెలుసుకుని బాగా చదువుకోవాలని పిల్లలను అను నయించారు. బాధిత పిల్లలకు, ఇతర అవసరాలు కలిగిన పిల్లలకు పౌష్టికాహారం, విద్య, చదువు నిమిత్తం మిషన్ వాత్సల్య పథకం ద్వారా జిల్లాలో 358 మందికి నెలకు రూ.4 వేలు చొప్పున ఇవ్వడం జరుగుతుందని ఇప్పటికీ ఏడాది పూర్తయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐసిడియస్ అధికారి బి.సుజాత రాణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, భాధిత పిల్లలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ బారికేడ్లు వితరణ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌కు 10 ఐరన్ బారికేడ్లు స్థానిక సిఐ బిఎస్ అప్పారావు, ఎస్సై, యస్ లక్ష్మి కాంతం సమక్షంలో పోలీస్ స్టేషన్‌కు అందజేసారు. ఈ సందర్భంగా బారికెట్లు అందజేసిన క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ సిబ్బందిని సిఐ, ఎస్‌ఐలు అభినందించారు. మా కంపెనీ 18 రాష్ట్రాలలో విస్తరించి 2061 బ్రాంచ్‌లు పరిధిలో సియస్ఆర్ నిర్వహిస్తున్నారని మన 2 తెలుగు రాష్ట్రాలలో ఉన్న 62 బ్రాంచ్‌ల పరిధిలో పోలీస్ స్టేషన్‌లకు అందజేశామని తెలిపారు. సిఎస్ఆర్ సోషల్ రెస్పాన్సిబిలి టీలో భాగంగా ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా ప్రతి ఒక్కరు ఆలోచన సాగించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సిస్ ఇండియా ఫౌండేషన్ విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ వెంకట రమణ, లైజనింగ్ ఆఫీసర్ రమేష్ బాబు, ఏరియా మేనేజర్ జి రాంబాబు, బ్రాంచ్ మేనేజర్ పి నానాజీ, స్థానిక బ్రాంచ్ సిబ్బంది, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా ధాన్యం సేకరణ : జేసీ

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో రబీ-2024-25నుకు సంబంధించి ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. రబీ సీజన్ ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, ట్రాన్స్ పోర్ట్, లీగల్ మెట్రాలజీ, భారత ఆహార సంస్థ అధికారులు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సీఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై జేసీ.. అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇందుకు రెవెన్యూ, వ్యవసాయం, పౌరసరఫరాలు, మార్కెటింగ్, ట్రాన్స్ పోర్ట్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ రబీ సీజన్లో 5.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనాకు, స్థానిక వినియోగం నిమిత్తం 0.44 లక్షల మెట్రిక్ టన్నులు పోను సుమారు 5.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు రానుందని తెలియజేశారు. ఇందులో మిల్లర్ల ద్వారా సుమారుగా 1.88 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా మిగిలిన 3.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా సేకరించవలసి ఉంటుందని జేసీ వివరించారు. ఇందుకు అవసరమైన సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రబీ- 2025 సీజన్‌లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 (75 కేజీలకు రూ.1,740), సాధారణ రకం క్వింటాకు రూ.2,300 (75 కేజీలకు రూ.1,725) లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ధాన్యం సేకరణలో ప్రభుత్వ అధికారులతో సహకరించాలని మిల్లర్ల ప్రతినిధులను కోరారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె శ్రీరమణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం దేవాల నాయక్‌బీ జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్‌ఎస్ఎస్ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్ విజయ్ కుమార్, మార్కెటింగ్ ఏడి కేఆర్ఆర్ నాగేశ్వరరావు, సహకార, ట్రాన్స్ పోర్ట్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర, వీరవాసరం: రొయ్యల రైతులను కూటమి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మండల రొయ్యల రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్ల రాంబాబు అన్నారు. ప్రాన్ ఎక్స్పోర్టర్స్ పై, ఫీడ్ ప్లాంట్ల యజమానులపై కూటమి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లాలోని పలువురు రైతులు వీరవాసరం తూర్పు చెరువు సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రొయ్యల ఎగుమతి దారులు సిండికేట్‌గా తయారై రొయ్యల రైతులకు తీరని నష్టం కలుగజేస్తున్నారని, వారం రోజుల క్రితం 100 కౌంటు రొయ్యల ధర కిలో రూ.250 నుంచి రూ. 260లు ఉండేదని రెండు మూడు రోజుల నుండి హఠాత్తుగా రొయ్యల ధరలను రూ.220 నుంచి రూ.230లకు తగ్గించారని, ప్రాన్ ఎక్స్పోర్టర్స్ సిండికేట్‌గా తయారయ్యి రొయ్యల రైతులను నిలువునా నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క సోయా వంటి ముడి పదార్థాల రేట్లు తగ్గినా ఫీడ్ రేట్లు మాత్రం తగ్గించకుండా ఫీడ్ ప్లాంట్ల యజమానులు సైతం రొయ్యల రైతులను దారుణంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు రొయ్యల రైతులను వెంటనే ఆదుకోవాలన్నారు. అంతకుముందు వీరవాసరం -బ్రాహ్మణ చెరువు రహదారి నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా తరలివచ్చి వీరవాసరం తూర్పు చెరువు సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యరకరాజు హరిబాబు, వీరవల్లి చంద్రశేఖర్, గుండా నరసింహారావు, నాగరాజు గోపిరాజు, తోట విజయ్ కుమార్, గుడాల వెంకటేశ్వరరావు, గంధం కేసు బాబు, కొప్పినీడి సర్వేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాసరావు, దాసరి మాణిక్యాలరావు, కడలి నెహ్రూ, జుత్తిక శ్రీనివాస్, నాగరాజు సత్యనారాయణ రాజు , వేండ్ర లీలా కృష్ణ, మరిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా సారా విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అక్రమంగా సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె. వీరబ్రహ్మం తెలిపారు. మండలంలో కన్నాపురం గ్రామంలో నాటు సారా నిక్కరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపు లోకి తీసుకోవడం జరిగిందని, వారి వద్ద నుండి 10 లీటర్ల నాటు సారా స్వాధీనపరచు కోవడం జరిగిందని, వీరిద్దరికీ తారా సప్లై చేస్తున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకొని వీరి ముగ్గురిపై కేసు నమోదు చేయడం జరిగిందని వీరబ్రహ్మం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారుచేసిన, విక్రయించిన, కఠిన చర్యలు తీసుకో వడం జరుగుతుందని, సారా తాగి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని ఆయన తెలిపారు. ఈ దాడులలో సబ్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్, కానిస్టేబుల్ వెంకన్నబాబు, సత్యనారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

నేడు మద్యం షాపులకు టెండర్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులు లాటరీ ద్వారా కేటాయింపు ఈ నెల 6న గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం, భీమవరం లో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ హాల్ నందు జరుగునని, ధరఖాస్తు చేసుకొన్న వారు వారికి ఇవ్వబడిన ఎంట్రీ పాస్‌లతో ఒక గంట ముందు వేదిక వద్దకు చేరుకోవాలని, లాటరీ లో షాప్ పొందిన వారు మొదటి విడత లైసెన్స్ ఫీజును అదే రోజు సాయంత్రం చెల్లించి లైసెన్స్ పొందవలెనని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఈ. స్వరాజ్య లక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, విద్యార్థులు చదువులలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐసిడిఎస్ పొంగుటూరు సెక్టార్ సూపర్వైజర్ అంబటి సరస్వతి విద్యార్థినిలకు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా మండలంలో గవరవరం గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని లతో సరస్వతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ అరుణ, అంగన్వాడీ టీచర్స్ నాగవేణి, సిహెచ్ పాప, నాగ కుమారి, పాఠశాల ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పన కూటమి పార్టీకే సాధ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరా బత్తుల రాజశేఖర్ విజయం సాధించడానికి కృషి చేసిన కూటమి పార్టీల నాయకులకు, పట్టభద్రులైన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తు న్నట్లు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దుతారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్ప న కల్పించాలంటే రాష్ట్రంలో కూటమి పార్టీకే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

విశాలాంధ్ర-ఉయ్యూరు : చేపట్టిన వృత్తి ఎలాంటిదైనా మహిళలు అని రంగాల్లో రాణిస్తున్నారని స్థానిక ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుధారాణి అన్నారు. జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం బుధవారం స్థానికంగా రోటరీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మధుమేహ వ్యాధి వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతి తో పాటు పలువురు మహిళా వైద్యులను క్లబ్ ఘనంగా సత్కరించింది. క్లబ్ కార్యదర్శి రాణి స్థానిక మహిళా వైద్యులు డాక్టర్ కస్తూరి డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు .

ఏపీలో నిడ్జమ్ పోటీలకు కసరత్తు

శాప్ ఛైర్మన్, ఎండీలతో ఏఎఫ్ఐ ప్రతినిధుల భేటీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరస్పర సహకారంతో రాష్ట్రంలో అథ్లెటిక్స్ క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కసరత్తు చేస్తున్నట్లు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ పీఎస్.గిరీషాలతో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్(నిడ్జమ్) నిర్వహించాలనే దిశగా వారు చర్చించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలను సైతం నిర్వహించుకునే దిశగా రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడాసౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఏపీలో క్రీడల అభివృద్ధికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏపీలో అథ్లెటిక్స్ అభివృద్ధి చేయాలని చేసిన విజ్ఞప్తిపై ఏఎఫ్ఐ సుముఖత వ్యక్తం చేయడం సంతోషదాయకమన్నారు. నిడ్జమ్ నిర్వహణకు అనుగుణంగా క్రీడాసౌకర్యాలు, వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం ఏఎఫ్ఐ ప్రతినిధులు బదులిస్తూ క్రీడలకు, క్రీడాకారులకు పెద్దపీట వేస్తున్న ఏపీలో ఈ ఏడాది నిడ్జమ్ పోటీలను నిర్వహించేందుకు ఏఎఫ్ఐ సిద్ధంగా ఉందని, నిడ్జమ్ పోటీల నిర్వహణతో రాష్ట్రవ్యాప్తంగా అథ్లెటిక్స్‌లో మరింతమంది క్రీడాకారులు రాణించేందుకు దోహదపడుతుందన్నారు. నిడ్జమ్ పోటీల నిర్వహణలో దేశవ్యాప్తంగా 625 జిల్లాల నుంచి 7వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, ఏఎఫ్ఐ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అంజీవ్‌బాబి జార్జి, సౌత్ ఏషియన్ అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రవీంద్ర చౌదరి, ఏఎఫ్ఐ ట్రెజరర్ స్టాండీ జోన్స్ తదితరులు పాల్గొన్నారు.

దండమూడి ఇండోర్ స్టేడియం పరిశీలన..

ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ విజయవాడ బందర్ రోడ్డులోని డా.దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో ఏపీ అసెంబ్లీ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు మూడు రోజులపాటు సమావేశాలు ముగిసిన అనంతరం ఆటవిడుపు కల్పించనున్నారు. సందర్భంగా పోటీలు నిర్వహించనున్న దండమూడి ఇండోర్ స్టేడియాన్ని శాప్ ఛైర్మన్ రవినాయుడు, శాప్ ఎండీ పీఎస్.గిరీషా, శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్‌లు బుధవారం పరిశీలించారు. పురుషులు, మహిళలు పోటీల్లో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేయాలని స్టేడియం నిర్వాహకులకు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. స్టేడియంలో కల్పించాల్సిన సౌకర్యాలు, వసతులు, గ్యాలరీ, లైటింగ్, స్పోర్ట్స్ కోర్టుల ఏర్పాట్లపై చర్చించారు. క్రీడాపోటీలకు సంబంధించి శాప్ ఆధ్వర్యంలో పక్కాగా ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ అమృత్, స్టేడియం సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ కమ్యూనిటీని సందర్శించిన అంతర్జాతీయ బృందం

విశాలాంధ్ర-ఉయ్యూరు : స్థానిక రోటరీ కంటి వైద్యశాలను రోటరీ వృద్ధాశ్రమాన్ని బుధవారం రోటరీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు, అమెరికా దేశస్తులు మార్క్ మెలోని మరియు గే మెలోని దంపతులు వారితోపాటు %ణతీ% భరత్ పాండ్యా ఇంటర్నేషనల్ డైరెక్టర్, శ్యామ్ మొవ్వ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ సందర్శించారు. రోటరీ మాజీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్ సంపత్ కుమార్ రోటరీ కంటి ఆసుపత్రి, డెంటల్ మరియు వృద్ధాశ్రమ వివరాలను అతిథులకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పిడిజి శ్యామ్ మొవ్వ, మాజీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్, పిన్నమనేని చంద్రమోహన్, పులి శ్రీనివాసరావు, ఎంబీటీ ప్రసాద్ రెడ్డి, అమీర్ మీర్జా, రోటరీ మేనేజర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

లార్జ్ క్యాప్ ఎన్ఎఫ్ఓను ఆవిష్కరించిన శామ్‌కో మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : లార్జ్-క్యాప్ స్టాక్స్‌లో ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ 'శామ్‌కో లార్జ్ క్యాప్ ఫండ్'కి సంబంధించిన న్యూ ఫండ్ ఆఫర్‌ను (ఎన్ఎఫ్ఓ) శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఆవిష్కరించిందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చ్ 5 నుంచి మార్చ్ 19 వరకు ఈ ఎన్ఎఫ్ఓ సబ్‌స్క్రిప్షన్ల కోసం అందుబాటులో ఉంటుందన్నారు. 100 లార్జ్ క్యాప్ కంపెనీలతో వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోను నిర్మించడం ద్వారా దీర్ఘకాలికంగా పెట్టుబడుల వృద్ధి ప్రయోజనాలను అందించాలనేది ఈ ఫండ్ లక్ష్యమన్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా శామ్‌కో లార్జ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించేందుకు ఇదే సరైన తరుణమన్నారు. క్షీణత రిస్కులను అధిగమిస్తూ, వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా దీనితో ఇన్వెస్టర్లు ప్రయోజనం పొందగలరని శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో విరాజ్ గాంధీ తెలిపారు. రిస్కుకు తగ్గ రాబడులను అందించేలా పోర్ట్‌ఫోలియో మెరుగ్గా ఉండేందుకు క్రమశిక్షణతో కూడుకున్న ఈ విధానం తోడ్పడుతుందని శామ్‌కో అసెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఐవో ఉమేష్‌కుమార్ మెహతా తెలిపారు. ఏకమొత్తంగా అయితే కనీసం రూ. 5,000 నుంచి, అదే సిప్‌లైతే కనీసం 12 ఇన్‌స్టాల్‌మెంట్లకు కట్టుబడి ఉండేలా రూ. 500 నుంచి ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చన్నారు. శామ్‌కో లార్జ్ క్యాప్ ఫండ్ ఎన్ఎఫ్ఓ గురించి మరింత సమాచారం కోసం https://www.samcomf.com/mutual-funds/samco-large-cap-fund-direct-growth/lcdgg ను సందర్శించాలన్నారు.